ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 06.05.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సమర్పించిన నివేదికపై సానుకూలత వ్యక్తం చేస్తూ, పంట మార్పిడి విధానంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ జరుపుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.

2. రైతు సంక్షేమమే ధ్యేయంగా జొన్నలను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల బృందం కీలక నిర్ణయం తీసుకుంది.

3. బెంగాల్ ఎన్నికల్లో ప్రజాతీర్పును గౌరవించకుండా మమత పదవిలో కొనసాగడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు.

4. చెన్నూరు నియోజకవర్గంలో అకాల వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి వివేక్ వెంకటస్వామి, త్వరలోనే సర్వే పూర్తి చేసి బాధితులకు నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు.

**పంట మార్పిడి నివేదిక**

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పంట మార్పిడిపై రూపొందించిన నివేదికను అందజేశారు. ఈ సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి కూడా పాల్గొన్నారు. పంట మార్పిడి విధానంపై ప్రభుత్వం సమగ్ర చర్చ జరపాలని భావిస్తోందని, ఈ అంశంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చను ఏర్పాటు చేస్తామని

ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ విషయంలో మరింత లోతుగా అధ్యయనం చేసి, రైతులకు మేలు చేకూరేలా నిర్మాణాత్మక సూచనలతో ముందుకు రావాలని కమిషన్ సభ్యులకు సూచించారు.

**డెస్క్**

**సీఎం సమీక్ష**

తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. నైపుణ్యాభివృద్ధి ద్వారానే ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని, స్టార్టప్‌లను ప్రోత్సహించడం వల్ల పారిశ్రామికంగా పురోగతి సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. విద్యా సిలబస్‌లో ఏఐ వినియోగంపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపిన సీఎం, ఈ విషయంలో తగిన సలహాలు ఇవ్వాలని రాజన్‌ను కోరారు. తమిళనాడు తరహా పారిశ్రామిక విధానం పెట్టుబడులను ఆకర్షిస్తుందని, డేటా సెంటర్ల నిర్వహణలో విద్యుత్, నీటి వినియోగంపై దృష్టి సారించాలని రాజన్ సూచించారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఉపాధి కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం వివరించగా, త్వరలోనే హైదరాబాద్ సందర్శిస్తానని రఘురామ్ రాజన్ ఈ సందర్భంగా వెల్లడించారు. భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**డెస్క్**

**మంత్రివర్గ ఉప సంఘం**

రైతుల సంక్షేమం కోసం మొక్కజొన్నతో పాటు జొన్నలను కూడా మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. సచివాలయంలో జరిగిన సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కేంద్రం నుంచి సహకారం లేకపోయినా రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే ఈ కొనుగోళ్లు చేపడతామని మంత్రి తుమ్మల తెలిపారు. ఇప్పటికే 5 లక్షల 50 వేల  టన్నుల మొక్కజొన్న సేకరించామని, జొన్నలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఈ

నిర్ణయం తీసుకున్నామని వివరించారు. వీటిని రేషన్ దుకాణాలు, గురుకులాలు, హాస్టళ్లలో పంపిణీ చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

**డెస్క్**

**భద్రకాళి ట్యాంక్ బండ్**

వరంగల్ నగరంలోని భద్రకాళి ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. గ్రేటర్ వరంగల్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.84.20 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ బండ్‌ను నేడు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ సంయుక్తంగా ప్రారంభించారు. భద్రకాళి దేవాలయం, పద్మాక్షి ఆలయం, సిద్ధేశ్వరుల గుట్టల మధ్య ఉన్న ఈ బండ్ నగర పర్యాటకానికి కొత్త ఆకర్షణగా నిలుస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**పీటీసీ - వరంగల్**

**చిత్రపురి ఫిల్మ్ ఫెస్టివల్**

హైదరాబాద్ నగరంలో చిత్రపురి ఫిల్మ్ ఫెస్టివల్ వరల్డ్స్ 1st ఫార్మాట్ & ఇండియాస్ బిగ్గెస్ట్ ఫెస్టివల్ నిర్వహణ పై రూపొందించిన వాల్ పోస్టర్ ను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి లోని తన నివాసంలో ఆవిష్కరించారు. హైదరాబాద్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందన్నారు. ఫార్మా, ఐటీ హబ్ గా హైదరాబాద్ కు ప్రపంచ వ్యాప్త గుర్తింపుకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు.

**పీటీసీ - సంగారెడ్డి**

**సూర్యాపేట**

రైతులు విక్రయించిన ధాన్యానికి 48 గంటల్లోపే నగదు చెల్లించాలని పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అధికారులను ఆదేశించారు. సూర్యాపేట జిల్లాలో కొనుగోలు

ప్రక్రియను సమీక్షించిన ఆయన, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. ఇందుకోసం అదనపు లారీలు, హమాలీలను ఏర్పాటు చేయాలని, మిల్లుల్లో ధాన్యం లోడింగ్ ప్రక్రియ వేగంగా జరగాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని కమిషనర్ దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**పీటీసీ - నల్గొండ**

**సైబర్ వారియర్స్**

ఆసిఫాబాద్ జిల్లాలో సైబర్ నేరాల నియంత్రణకై సైబర్ వారియర్స్ ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. సైబర్ వారియర్స్‌కు ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణ శిభిరం సందర్శించి టీ-షర్ట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ సైబర్ నేరాలను సమర్థవంతంగా నియంత్రించేందుకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ సైబర్ వారియర్స్ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంచడంలో వారు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

**పీటీసీ - ఆసిఫాబాద్**

**పీఎం కిసాన్ సమ్మాన్ నిధి**

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం నిధులు తనకు వ్యవసాయ అవసరాలకు చాలా ఉపయోగపడుతున్నాయని, రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారు కత్తి లస్మయ్య ఆకాశవాణితో చెప్పారు.

**బైట్ - కత్తి లస్మయ్య**

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

**బీఆర్ఎస్ ధర్నా**

అకాల వర్షానికి మృతి చెందిన రైతు కుటుంబాలకు 50 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేస్తూ లక్షెట్టిపేటలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. మాజీ మంత్రి జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు పాల్గొని, తడిసిన ధాన్యాన్ని బేషరతుగా కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించి ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పిటిసి, మంచిర్యాల

**రాంచందర్ రావు**

బెంగాల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మమతా బెనర్జీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయకపోవడాన్ని తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రంగా తప్పుపట్టారు. ప్రజాతీర్పు వ్యతిరేకంగా వచ్చినా పదవిలో కొనసాగాలని చూడటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ఇది ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని ఆయన విమర్శించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 172 ప్రకారం ఐదేళ్ల పదవీకాలం ముగిసిన తర్వాత ఆమె పదవిలో ఉండటం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. రాజ్యాంగ సూత్రాల ప్రకారం మెజారిటీ సాధించిన పార్టీయే అధికారంలోకి రావాలని, మమతా బెనర్జీ వైఖరి రాజ్యాంగ ధర్మాసనాల తీర్పులకు వ్యతిరేకమని ఆయన పేర్కొన్నారు.

**డెస్క్**

**వివేక్ వెంకటస్వామి**

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి భరోసా ఇచ్చారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఆయన, రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ విషయంపై ఇప్పటికే వ్యవసాయ శాఖ మంత్రితో చర్చించానని,

త్వరలోనే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి బాధితులకు తగిన పరిహారం అందిస్తామని స్పష్టం చేశారు.

**బైట్ - వివేక్ వెంకటస్వామి**

**పీటీసీ – మంచిర్యాల**

**నోష్ ల్యాబ్ ప్రమాద బాధితులు**

నల్లగొండ జిల్లా, ఎలిమినేటి గ్రామంలోని నోష్ ల్యాబ్ ప్రమాద బాధితులను సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పరామర్శించారు. యాజమాన్య నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని ఆరోపిస్తూ, గాయపడిన కార్మికులకు రూ. కోటి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించేలా ప్రభుత్వం చొరవ చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**పీటీసీ - నల్గొండ**